క్లుప్తంగా

అప్పిలేట్ అధికారి పేరు మార్పు

సాక్షి ఎఫెక్ట్..



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అప్పిలేట్ అధికారిగా మున్సిపల్ కమిషనర్ రాజు పేరును సమాచార హక్కు చట్టం-2005 బోర్డుపై ఏర్పాటు చేశారు. బోర్డుపై అప్పిలేట్ అధికారిగా ఇటీవల బదిలీపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ పేరునే కొనసాగించారు. దీంతో సాక్షి దిన పత్రికలో బుధవారం 'అధికారి పేరు మార్చరా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. దీంతో బోర్డుపై ప్రస్తుత కమిషనర్ పేరును ఏర్పాటు చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



పెర్కిట్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలన్నారు. అనంతరం ఏసీపీని హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోచన్న, లక్ష్మణ్, భారతి, సుజాత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్'



మోర్తాడ్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు బీసీ డిక్లరేషన్‌లో ముదిరాజ్ కార్పొరేషన్‌ను ప్రకటించిందని ముదిరాజ్ సంఘం బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడు జక్కం అశోక్ అన్నారు. బుధవారం మోర్తాడ్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ముదిరాజ్‌లకు కార్పొరేషన్‌ను ప్రకటించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 60 లక్షల మంది ముదిరాజ్ సంఘం సభ్యులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జక్కం శ్రీనివాస్, నవీన్, అరవింద్, అనిల్, అశోక్, వంశీ, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతన వెతలు..!

- మూడు నెలలుగా జీతాలు అందక అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఇక్కట్లు
- అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్న వైనం



బోధన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి

బోధన్‌టౌన్: అవుట్ సోర్సింగ్ సిబ్బంది అంటే అందరికీ అలుసే. రాత్రింబవల్లు వారితో వెట్టిచాకిరి చేయించుకుంటారు. అలా అని సరైన సమయానికి వేతనాలు ఇస్తారా అంటే అదీ లేదు. ఇదేంటని అడిగితే రేపటి నుంచి ఎక్కడ డ్యూటీకి రాకు అని అంటారేమోనని సిబ్బంది బాధపడుతూ పని చేస్తుంటారు. ఇలా వేతనాలు సరైన సమయానికి అందక కుటుంబాలను పోషించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ బోధన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో గత మూడు నెలలుగా వేతనాలు అందక అప్పులు చేసి మరీ కుటుంబాలను పోషించుకుంటున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది దుస్థితి.

లో పేషెంట్ కేర్, సెక్యూరిటీ, పారిశుధ్యం సిబ్బంది 45 మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తుంటారు. వీరికి గత మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను ఆస్పత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆస్పత్రికి డివిజన్‌లోని మండలాలైన బోధన్, సాలూర, ఎడపల్లి, రెంజల్, కోటగిరి, పొతంగల్, రుద్రూర్, వర్ని, చందూర్, మోస్రాతో పాటు పట్టణ, బీర్కూర్, నస్రుల్లాబాద్‌తో పాటు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర ప్రజలు చికిత్స కోసం వస్తుంటారు. ప్రతి రోజు సుమారు 800 మంది ఔట్ పేషెంట్స్, 70 మంది ఇన్‌పేషెంట్స్ చికిత్స పొందుతుంటారు. వీరి కోసం అవుట్ సోర్సింగ్ పద్ధతిన కేటాయించిన సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుంటారు. కానీ వీరి వేతనాల అమలు కోసం ఎవరూ పట్టించుకోవడం లేదు. వేతనాలు అందక కుటుంబ పోషణ, పిల్లల చదువు ఎలా సాగేది అంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక అప్పులు చేసి కాలం వెల్లదీస్తున్నారు. ఇకనైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు, ఏజెన్సీ నిర్వాహకులు స్పందించి అవుట్ సోర్సింగ్ సిబ్బంది, కార్మికుల వేతనాలు చెల్లించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమ్దాపూర్ సొసైటీ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

బోధన్‌రూరల్: మండలంలోని అమ్దాపూర్ సొసైటీ చైర్మన్ గిర్దావర్ గంగారెడ్డిపై సొసైటీ సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఇటీవల సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం కోసం డైరెక్టర్లు జిల్లా సహకర అధికారి శ్రీనివాస్‌రావుకు లేఖ అందించారు. వారి విన్నపం మేరకు సొసైటీలో బుధవారం అవిశ్వాస తీర్మాణం కోసం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఒక్క సొసైటీ డైరెక్టరు కూడా హాజరుకాకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుత చైర్మన్ గంగారెడ్డినే సొసైటి చైర్మన్‌గా కొనసాగుతారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్, సొసైటీ సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి శ్రీనివాస్

అనంతకుమార్‌ను బీజేపీ నుంచి బహిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్: అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని హేళన చేసి మాట్లాడిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీ, మాజీ మంత్రి అనంతకుమార్ హెగ్డేను పార్టీ నుంచి బహిష్కరించాలని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో వివిధ దళిత సంఘాల నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన్న మాట్లాడుతూ.. 400 ఎంపీ సీట్లు వస్తే అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని మారుస్తామని అనంతకుమార్ ప్రకటించడం హేయమైన చర్య అన్నారు. దీనికి క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోతె భూమన్న, బచ్చపల్లి దేవయ్య, రాములు, ప్రభాకర్, పోషన్న, రమేశ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా నాయకుల అరెస్టు అమానుషం

ఆర్మూర్‌టౌన్: ప్రజాపంథా నాయకుల అరెస్టు అమానుషమని సీపీఐఎంఎల్ సబ్ డివిజన్ నాయకులు ఆకుల గంగన్న, అనిల్‌కుమార్ అన్నారు. నేషనల్ హైవే మంజూరు కావడంతో మెర్తాడ్, కమ్మర్‌పల్లి, భీంగల్ మండలాల రైతులు నష్టపోతున్నారని వారికి అండగా సీపీఐఎంఎల్ ప్రజాపంథ పార్టీ నిలబడితే ఆర్డీవో, పోలీసులు దురుసుగా ప్రవర్తించి అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమైన చర్యఅని అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరసాలో నాయకుల అరెస్టుకు నిరసనగా ఏసీపీ, ఆర్డీ వో దిష్టిబొమ్మను దహనం చేశారు. వెంటనే నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌పై దురుసుగా ప్రవర్తించిన ఎస్సై ముక్రీను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రణయ్ సిద్ధార్థ్, మహేశ్, రిషేంద్ర, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్: మోర్తాడ్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు మద్దతుగా ఆందోళన చేపట్టిన తమ పార్టీ నాయకులను అరెస్టు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ సహాయకార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. నాయకులపై దురుసుగా ప్రవర్తించిన ఎస్సైలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పడాల శంకర్, సుల్తాన్, సాయిలు, సీతారాం పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం'

ఆర్మూర్‌టౌన్: బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిపై ఎవరైనా అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్ హెచ్చరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేవైఎం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు నచ్చక కొందరు కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. సమావేశంలో బీజేవైఎం మాక్లూర్ అధ్యక్షుడు రాజశేఖర్ రాథోడ్, ఉదయ్‌గౌడ్, రాము తదితరులు ఉన్నారు.

దేవమ్మ ఆలయంలో పూజలు



నందిపేట్: మండలంలోని బజార్‌కొత్తూరులో దేవమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. గ్రామస్తులు, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో యజ్ఞం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం పరిశీలించారు. ఈ నెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలను నిర్వహించనున్నారు. దీంతో పరీక్ష కేంద్రాలను పరిశీలించి పాఠశాలల్లోని సౌకర్యాల గురించి హెచ్ఎంలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు ముందు పరీక్ష కేంద్రాల ఆవరణలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని సూచించారు. ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్ మహేశ్, హెచ్ఎంలు ఉన్నారు.

'సీఎంను విమర్శిస్తే సహించేది లేదు'

పెర్కిట్: ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ అన్నారు. పెర్కిట్‌లోని పీవీఆర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేకు సత్తా ఉంటే నిధులు తీసుకు రావాలని లేదంటే అభివృద్ధికి సహకరించాలని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ్ అగర్వాల్, నాయకులు తిర్మన్‌పల్లి నవనీత్, నిఖిల్, శ్రావణ్, రాజశేఖర్, గుండు హరీశ్, కిరణ్, వినోద్, సుశాంత్ తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



రుద్రూర్‌లో పాలాభిషేకం చేస్తున్న నాయకులు



కమ్మర్‌పల్లిలో..

బోధన్: వీరశైవ లింగాయత్ లింగ బలిజ సామాజికవర్గ ఫైనాన్షియల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తు రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వీరశైవ లింగాయత్ సమాజ్ పట్టణ కమిటీ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. సమాజ్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ పటేల్, ప్రతినిధులు రవి పటేల్, మాధవరావు, నాగభూషణం, యాదవరావు పటేల్, సాలూర గ్రామ అధ్యక్షుడు శివపూజ శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: రాష్ట్ర మంత్రి వర్గం 16 కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, పట్ల సురేశ్, ఇందూర్ కార్తిక్, మాశెట్టి శ్రీనివాస్, నేమాని వీర్రాజు, పార్వతి ప్రవీణ్, కుర్మాజి సాయిలు, నిసార్, దత్తు, రజాక్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డి మహిళా సదస్సులో స్వయం సహాయక సంఘాల మహిళలకు పలు వరాలు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కమ్మర్‌పల్లిలో మహిళా సంఘాలు సంబురాలు చేపట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క చిత్రపటాలకు రాఖీ కట్టి, స్వీట్లు తినిపంచారు. సెర్ప్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్, సీసీలు రవికుమార్, భాగ్యలక్ష్మి, అలేఖ్య, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యేల పరామర్శ



బాధితులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వేల్పూర్: మండల కేంద్రానికి చెందిన రాజారపు నరేశ్ బైకు అదుపుతప్పి ప్రమాదవశాత్తు మరణించగా బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పాల్గొని కుటుంబీకులను ఓదార్చారు. వేల్పూర్‌లో గుండెపోటుతో మరణించిన మున్నూరు భూమన్న కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

వర్నిలో..

వర్ని(చందూర్): ఇటీవల నిజాంసాగర్ కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన చందూర్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్, వర్ని మండలం అప్పంది ఫారం గ్రామానికి చెందిన విజయ్, నారాయణ కుటుంబాలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

వర్ని: మండలంలోని హుమ్నాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ మేక శ్రీలక్ష్మి బుధవారం భూమి పూజ చేశారు. ఎంపీటీసీల ఫో రం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు, ఎంపీటీసీ గంగామణి, సర్పంచ్ బొక్కెటి గంగవ్వ, వీర్రాజు, వీరయ్య, గంగప్ప పాల్గొన్నారు.

మురికి కాలువ నిర్మాణానికి..

వర్ని(మోస్రా): మండల కేంద్రంలో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి మోస్రా జెడ్పీటీసీ గుత్పా విజయభాస్కర్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. వంపీపీ పిట్ల ఉమా, శ్రీరాములు, ఎంపీడీవో ప్రవీణ్, ఉప తహసీల్దార్ సాయిలు, ఎంపీవో రఫీ, బీఆర్ఎస్ మండల కార్యదర్శి సాయి గౌడ్, సర్పంచ్ సుమలత రాంరెడ్డి పాల్గొన్నారు.



తట్టికోటలో మహిళా దినోత్సవం

బోధన్: పట్టణ కేంద్రంలోని తట్టికోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎం లలిత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో నాగ్‌నాథ్, మండల నోడల్ ఆఫీసర్ నాగయ్య, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అజీమొద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం శాంత, ఆశావర్కర్ అనురాధ, అంగన్‌వాడీ టీచర్ లోకేశ్వరి, ఇందిరా, పిల్లల తల్లులు లలిత, జ్యోతి, లావణ్య, శ్యామల, అనితలను సన్మానించారు. సోషల్ వర్కర్ సనాపటేల్ పాల్గొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న అధికారులు

సంక్షిప్తం

పరీక్ష అట్టల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్థానిక 2021-22 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పరీక్ష అట్టలను ఎంఈవో ఆంధ్రయ్య బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బోధన్‌టౌన్: ఎమ్మెల్సీ కవిత జన్మదినం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బీఆర్ఎస్ నాయకులు రోగులకు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీఆర్ దేశాయ్, నాయకులు తోకల గంగారెడ్డి, నక్కలింగారెడ్డి, రవిశంకర్‌గౌడ్, సాగర్, ఎస్ఆర్ఐ బాబా, హైమద్, అడ్లూరి నరేశ్, భవానిపేట్ శ్రీనివాస్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో..

నవీపేట: ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, తెడ్డు పోశెట్టి, అబ్బన్న, కృష్ణమోహన్, దొంత ప్రవీణ్, అల్లం రమేశ్, సాయికుమార్‌గౌడ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభం

బోధన్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె చేపట్టారు. పట్టణ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బోధన్, సాలూర మండలాల కార్మికులు సమ్మెలో భాగంగా బుధవారం ధర్నా నిర్వహించారు. తమకు రావాల్సిన బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. యూనియన్ ప్రతినిధులు, కార్మికులు రూప, పుష్ప, ఈశ్వరి, సుభద్ర, ఉమా, శ్యాంరావు, నాగరాజు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

రెంజల్: మండలంలో పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్ బుధవారం తెలిపారు. దూపల్లిలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో కార్యదర్శులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వంద శాతం పన్నులను వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌస్, కార్యదర్శులు ఉన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

వేల్పూర్: అంబేడ్కర్ స్థాపించిన సమతాసైనిక్‌దళ్ 97వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘ సభ్యులు రామన్నపేట్‌లో ఆయన విగ్రహానికి బుధవారం నివాళులర్పించారు. సమతాసైనిక్‌దళ్ ద్వారా అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు బాబూరావు, రణ ధీర్, నితిన్, వినోద్, విశ్వనాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలి

మాక్లూర్: మహిళల హక్కులను కాలరాస్తున్న బీజేపీ, మిత్ర పక్షాలకు ప్రతి మహిళ వ్యతిరేకంగా పోరాడాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సవిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మాణిక్ బండార్‌లో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో లతా, సుబ్బలక్ష్మి, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరి రుణం తీర్చుకోవడమే ధ్యేయం

బోధన్‌టౌన్: పుట్టిన ఊరికి ఏదైనా సహాయం చేసి రుణం తీర్చుకోవడమే తన ధ్యేయమని ఐలవ్ మై విలేజ్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ నాగేంద్ర అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కంప్యూటర్ నేర్చుకోవడానికి విద్యార్థులు ముందుకు వస్తే సహకరిస్తానని అన్నారు. అనంతరం మండల విద్యాధికారి నాగ్‌నాథ్‌తో పాటు ఉపాధ్యాయుడు నాగేంద్రను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్ జ్యోతిరాజ్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రభావతి పాల్గొన్నారు.

కూరగాయల సంతకు వేలం

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో కూరగాయల సంతకు బుధవారం వేలం నిర్వహించారు. వేలంలో రూ. 3లక్షల17వేలకు బాలాజీ వేలం దక్కించుకున్నాడు. సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, ఎంపీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	బులెట్ (తెలుగు) - 10.25
	సైతాన్ (హిందీ) - 1.15, 7.00
	బాబు (తెలుగు) - 4.15
	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 10.00
స్క్రీన్-2 -	గామి (తెలుగు) - 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-3 -	భీమా (తెలుగు) - 12.30, 3.35, 6.40, 9.45

పరీక్షలపై భయం వీడాలి



రుద్రూర్: పదో తరగతి విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాయాలని కోటగిరి లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ సభ్యులు అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం లయ న్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోటగిరి అధ్యక్షుడు హన్మంత్‌రావు పటేల్, కార్యదర్శి కప్ప సంతోష్, మాజీ అధ్యక్షుడు తెల్ల రవికుమార్, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సవిత రాణి, లయన్స్ క్లబ్ డైరెక్టర్లు శ్రీకాంత్ అరవింద్, అర్పిత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

బోధన్‌టౌన్: పట్టణంలోని బస్వాతారక్ నగర్ కాలనీలో ఉన్న కోట మైసమ్మ సహిత లక్ష్మీనృసింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలను నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పసులేటి గోపికిషన్ బుధవారం తెలిపారు. గురువారం ఉదయం ప్రత్యేక పూజలు, యజ్ఞం, మహాపూజ, హారతి కార్యకరమాలు ఉంటాయన్నారు. వేడుకలకు పిట్ల కృష్ణ మహరాజ్, ఎంపీ ధర్మపురి అరివింద్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.